నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దోమకొండ, జూలై 24: దోమకొండ 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పాల్వంచ, మాచారెడ్డి మండలాలకు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కామారెడ్డి డివిజనల్ ఇంజనీర్ సాలీయానాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చుక్కాపూర్, లచ్చపేట, జగ్గానాయక్ తండా, వేల్పుగొండ, ఇసాయిపేట, భవానిపేట, అరేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.



మంజీరాలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

మంజీరాలో..
ఇసుకను తోడేశారు!

- ఇసుక తవ్వకాల్లో భారీగా అక్రమాలు
- కోట్లు విలువ చేసే ఇసుకను అక్రమంగా అమ్ముకున్నట్లు గుర్తించిన ప్రభుత్వం
- కాంట్రాక్టర్లు, టీజీఎండీసీ సిబ్బందిపై వేటు
- బ్లాక్ లిస్టులో కాంట్రాక్టర్ల సంస్థలు
- మంజీరాలో ఇసుక క్వారీలను రద్దు చేసిన ప్రభుత్వం
- యథేచ్ఛగా ఇసుక రవాణా
- రూ.కోట్లు సొమ్ము చేసుకున్న అక్రమార్కులు

కామారెడ్డి, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మంజీరా నదిలో కాంట్రాక్టర్‌లు, అక్రమార్కులు ఇసుకను తోడేళ్లల తోడేశారు. అనుమతి పేరిట ఇసుక అక్రమంగా తరలించి కోట్లాది రూపాయలు దండుకున్నారు. మంజీరా ఇసుక క్వారీల్లో భారీగా అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వం, టీజీఎండీఎస్ గుర్తించాయి. గత కొన్ని రోజులుగా బిచ్కుంద, బీర్కూర్ మంజీరా నది పరివాహకాల్లో అనుమతుల పేరిట ఇసుక తవ్వకాలు నిర్వహించారు. ఈ తవ్వకాల్లో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పలువురు ఫిర్యాదులు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండీఎస్‌ల ఆధ్వర్యంలో క్వారీల వద్ద విచారణ జరిపారు. దీంతో అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలింది. ఇసుక కాంట్రాక్టర్‌లు, స్థానికంగా టీజీఎండీసీ సిబ్బందిపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. క్వారీల వద్ద పనిచేసే టీజీఎండీసీ ఐదుగురు సిబ్బందిని తొలగించడంతో పాటు నలుగురు కాంట్రాక్టర్‌లపై చర్యలకు సిద్ధమైంది. సదరు ఇసుక కాంట్రాక్ట్ సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టింది. దీంతో పాటు మంజీరాలో నడుస్తున్న రెండు ఇసుక క్వారీలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది.

రెండు ఇసుక క్వారీల్లో తవ్వకాలు

జిల్లాలోని బిచ్కుంద, బీర్కూర్ పరిధిలో గల మంజీరాలో 2021లో చెక్‌డ్యాంల నిర్మాణానికి ఖద్గావ్, షెట్లూర్ శివారుల్లో 33 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆరు క్వారీలకు అనుమతులు మంజూరు చేసింది. సుమారు 3 ఏళ్ల పాటు కాంట్రాక్టర్లు ఇసుక తవ్వకాలు కొనసాగించారు. అయితే తమకు ఇచ్చిన కాంట్రాక్ట్ క్వారీల్లో క్వాంటిటీకి తగ్గట్టు తవ్వకాలు జరపలేదని ఇటీవల ప్రభుత్వానికి రీ టెండర్ వేశారు. దీంతో గత 3 నెలల కిందట 2, 3 క్వారీలకు టీజీఎండీసీ అధికారులు అనుమతులను మంజూరు చేశారు. దీంతో పాటు గుండెనెమలి, హస్గుల్ పట్టా భూముల్లోనూ ఇసుక మేటలు తొలగించేందుకు రైతుల పేరిట కాంట్రాక్టర్‌లు, రాజకీయ నాయకుల అండతో అనుమతులు తీసుకున్నారు. ఈ అనుమతుల పేరిట ఇసుకను అక్రమంగా తరలించారని ఆరోపణలు వెల్లువెత్తాయి.

అనుమతులు ఒకచోట తవ్వకాలు మరో చోట

ఇసుక కాంట్రాక్టర్‌లకు, ఇసుకాసురులకు తవ్వకాలకు అనుమతులు ఇవ్వడమే తరువాయి మంజీరా నదిలో ఇసుకాసురులు గద్దల్లా వాలిపోయి విచ్చలవిడిగా తవ్వకాలు జరుపుతుంటారు. గత మూడు నెలల కిందట మంజీరాలో ఇసుక తవ్వకాలకు టీజీఎస్‌ఎండీసీ అనుమతులు ఇవ్వడంతో కాంట్రాక్టర్‌లు, స్థానికంగా ఉంటే టీజీఎస్‌ఎండీసీ సిబ్బంది కుమ్మక్కై ఎలాంటి వేబిల్లులు లేకుండా వందల లారీల్లో అక్రమంగా ఇసుకను తరలించారు. అనుమతి ఒకచోట తీసుకుని తవ్వకాలు మరోచోట జరుపుతూ వేల క్యూబిక్ మీటర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తూ కాంట్రాక్టర్‌లు కోట్లు దండుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నును ఎగ్గొడుతూ ఇసుక కాంట్రాక్టర్లు టన్నుల కొద్ది భారీ వాహనాల్లో ఇసుకను తరలించినట్లు స్థానిక ప్రజాప్రతినిధి లక్ష్మీకాంతారావు టీజీఎస్‌ఎండీసీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గత 15 రోజుల నుంచి ఇసుక తవ్వకాలను ప్రభుత్వం నిలిపివేసింది. ఇసుక తవ్వకాల్లో అక్రమాలపై విచారణ జరపాలని అధికారులను ఆదేశించింది.

రూ.12కోట్లు విలువ చేసే ఇసుకను అక్రమంగా తరలించారు

మంజీరా నదిలోని ఇసుక క్వారీల్లో భారీగా అక్రమాలు జరిగాయని టీజీఎండీసీకి ఫిర్యాదులు వెళ్లడంతో అధికారులు విచారణ చేపట్టారు. దీంతో టీజీఎండీసీ చైర్మన్ అనిల్‌కుమార్, ఎండీ సురేంద్రమోహన్‌లు విచారణ చేపట్టారు. ఈ అక్రమాలపై డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎల్లయ్య ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఇసుక క్వారీల తవ్వకాలలో 4 లక్షల టన్నులు అక్రమంగా ఇసుకను తరలించారని దీంతో ప్రభుత్వం సుమారు 12 కోట్ల ఆదాయం నష్టపోయినట్లు తెలిసింది. దీంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని రిచ్‌ల వద్ద టీజీఎండీసీ అసిస్టెంట్‌లుగా పని చేస్తున్న లక్ష్మణ్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాంరెడ్డిలను విధుల నుంచి తొలగిస్తూ టీజీఎండీసీ ప్రకటించింది. అదేవిధంగా కాంట్రాక్టర్‌లైన ఏఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్, ఎంఎస్‌ఆర్ ప్రాజెక్ట్ మినరల్ ప్రైవేట్ లిమిటెడ్, సుధాకర్ ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్, సాయిడక్స్ ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టింది. ఈ సంస్థల డిపాజిట్‌లు, బ్యాంకు గ్యారెంటీలను జప్తు చేయాలని ఆదేశించింది.

మంజీరాలో ఇసుక తవ్వకాలు రద్దు

జిల్లాలోని మంజీరా నది పరివాహక ప్రాంతంలో లక్షల టన్నుల ఇసుక అక్రమ విక్రయాలపై ప్రభుత్వం కొరడా ఝులిపించింది. ఇసుక క్వారీల కాంట్రాక్టర్‌లు, టీజీఎండీసీ సిబ్బంది కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి కోట్లు దండుకున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు క్వారీల్లో తవ్వకాలను నిలిపివేసింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బిచ్కుంద, బీర్కూర్ మంజీరా పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు గత ప్రభుత్వంలో అనుమతులు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇటీవల 2, 3 క్వారీల్లో తవ్వకాలకు టీజీఎండీసీ అనుమతి ఇచ్చింది. ఈ తవ్వకాల్లో కాంట్రాక్టర్‌లు భారీగా అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలడంతో ఆ క్వారీల అనుమతులు రద్దు చేసి తవ్వకాలు నిలిపి వేయాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

చేప పిల్లల ఉత్పత్తి హుళక్కేనా?

- గత ఏడాది దాదాపు కోటి ఉత్పత్తి చేసిన మత్స్యశాఖ
- ఈ ఏడాది ఊసే లేదు
- నిజాంసాగర్‌లో నిర్మానుష్యంగా చేప పిల్లల నర్సరీలు, కార్యాలయాలు



ఉత్పత్తి లేక వెలవెల బోతున్న నర్సరీలు

నిజాంసాగర్, జూలై 24: ఉభయ జిల్లాల చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం నిజాంసాగర్‌లో ఈ ఏడాది చేప పిల్లల ఉత్పత్తి జరగడం లేదు. ఉత్పత్తి కేంద్రంలో పని చేసే అధికారులు, సిబ్బంది ఎక్కడ పని చేస్తున్నారో తెలియడం లేదు. ప్రతీ వర్షాకాలంలో దాదాపు కోటి చేప పిల్లల ఉత్పత్తి చేసేవారు. జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని మత్స్య పారిశ్రామిక సంఘాలకు సరఫరా చేస్తుంటారు. ప్రతీ వర్షాకాలంలో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ చేప పిల్లలకు తోడుగా వీటిని ఆయా సంఘాలకు సరఫరా చేస్తుంటారు. ప్రభుత్వం నుంచి వచ్చే వంద శాతం రాయితీ చేప పిల్లలను నిజాంసాగర్ ప్రాజెక్టుతో కౌలాస్, సింగీతం రిజర్వాయర్లే కాకుండా 3 నియోజక వర్గాల్లోని చెరువులు, కుంటల్లో చేప పిల్లలను విడుదల చేస్తుం టారు. ప్రతీ వర్షాకాలం నిజాంసాగర్ మత్స్య చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో దాదాపు కోటి చేప పిల్లలను ఉత్పత్తి చేస్తారు. ప్రభుత్వం నుంచి రాయితీపై ఇచ్చే చేప పిల్లలకు తోడుగానే వీటిని సరఫరా చేసి ఉత్పత్తి చేసే కాంట్రాక్టర్ల ను ఈ చేప పిల్లలను విలీనం చేసి సరఫరా చేస్తుంటారు. లక్షలాది రూపాయలను జిల్లా మత్స్యశాఖ, నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి అధికారి ముడుపులకు ఆశపడి కాంట్రాక్టర్ల లెక్కల్లోనే చూపుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఉభయ జిల్లాల మత్స్యశాఖ ప్రజా ప్రతినిధులు. మంత్రులు, ఎమ్మెల్యేల పేర్లను వినియోగించకుంటూ వ్యవహారం కొనసాగిస్తున్నారు. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం 11 ఎకరాల్లో ఉన్నప్పటికీ కేంద్రాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత ప్రభుత్వాలు, ప్రస్తుత పాలకులు పట్టించుకోకపోవడం గమనార్హం. నిజాంసాగర్ ప్రాజెక్టులో 44 లక్షల చేప పిల్లలు, 44 లక్షల రొయ్య పిల్లలు విడుదల చేస్తారు. కానీ ప్రాజెక్టులో నీటి నిల్వలు తరిగి పోతుండటంతో రాత్రివేళలో మధ్య దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రాత్రి వేళల్లో వందల క్వింటాళ్ల చేపలు వేటాడుతున్నా మత్స్య యంత్రాంగం ససేమిరా అంటున్నారు. నిజాంసాగర్ పరిసర ప్రాంతాల్లోని నిజాంసాగర్, బంజాపల్లి, పెద్ద ఆరేపల్లి, మాసాన్‌పల్లి, మాసాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు, సంగారెడ్డి జిల్లా బాచేపల్లి, నిజాంపేట్‌లలో మధ్య దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి, కార్మికుల నోట మట్టి కొడుతున్నారు. నిజాంసాగర్‌ను నమ్ముకున్న 323 గ్రామాల రైతులు, మత్స్య కార్మికులు నిజాంసాగర్‌పై ఆధారపడి ఉన్నా మధ్య దళారుల అజమాయిషీ ఉన్నా వారికి వత్తాసు పలుకుతున్నారు. నిజాంసాగర్ చేప ఉత్పత్తి కేంద్రంలో విధులు నిర్వహించే అధికారులతో పాటు సిబ్బంది ఎక్కడ ఉంటారో తెలియడం లేదు. బినామీ లైసెన్సుదారులే నిజాంసాగర్ ప్రాజెక్టులో హవా ఉన్నా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. నిజాంసాగర్‌లో చేప పిల్లల ఉత్పత్తి, అక్రమ లైసెన్సు దారులు చేపలు వేటాడుతున్నందున జిల్లా కలెక్టర్ స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మాట్లాడుతున్న కలెక్టర్

వర్షాల వల్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూలై 24: ముసురుతో కూడిన వర్షాలు పడుతున్నందున ఎలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వర్షాకాలంలో ప్రజలను అప్రమత్తం చేయడం, ధరణి, ల్యాండ్ ఆక్వేషన్, సీఎం గ్రీవెన్స్, డిస్ట్రిక్ గ్రీవెన్స్, ప్రభుత్వ భూమి సంరక్షణ, అన్ని రకాల ధ్రువీకరణ పత్రాల జారీ, విపత్తు నిర్వహణ, తదితర రెవెన్యూ శాఖకు సంబంధించిన అంశాలపై ఆర్డీవో స్థాయి నుంచి డిప్యూటీ తహసీల్దార్ వరకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసురుతో కూడిన వర్షాలు పడుతున్నందున ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని, మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్ వైద్య తదితర అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి చేపట్టాల్సిన సహాయ చర్యలపై సూచనలు చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 3500లకు పైగా ధరణి దరఖాస్తులను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని అన్నారు. భూమి కొలతల కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి త్వరగా కొలతలు కొలవాలని అన్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలను, జిల్లాలో నిర్వహించిన ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జమ కాని గ్యాస్ సబ్సిడీ

- ఖాతాలో జమ కాని రాయితీ
- బ్యాంకు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు

ఎల్లారెడ్డి, జూలై 24: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రకటించిన రూ.500లకే గ్యాస్ సబ్సిడీ పథకం పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సదుపాయం కల్పించిన ప్రభుత్వం మహిళలకు మరింత ఊరట కల్పించేందుకు మహాలక్ష్మి పథకం పేరుతో రూ.500లకే గ్యాస్ పథకం తీసుకొచ్చింది. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు గ్యాస్ బండ ధర సామాన్యుడికి భారంగా మారింది. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకం ప్రజలకు మరింత ఊరటనిచ్చింది. ఇందుకు ఎన్నికల ముందు ప్రభుత్వం కొంత మంది లబ్ధిదారులకు సబ్సిడీ నేరుగా జమ చేసింది. ఆ తరువాత ఎన్నికల కోడ్ రావడంతో పథకం అమలు ఆగిపోయింది. తరువాత గ్యాస్ సిలిండర్ తీసుకున్న వారికి గ్యాస్ సబ్సిడీ రావడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసిపోయి నెల రోజుల పాటు అయింది. అయినా గ్యాస్ సబ్సిడీ పథకం నిధులు ప్రభుత్వం విడుదల చేయలేకపోవడంతో అందరికీ గ్యాస్ సబ్సిడీ అందడం లేదని వాపోతున్నారు.

సబ్సిడీ కోసం ఎదురు చూస్తున్న వినియోగదారులు

కామారెడ్డి జిల్లాలో గ్యాస్ పథకం కింద హెచ్‌పీ, ఇండియన్, భారత్ తదితర గ్యాస్ కంపెనీలకు చెందిన ఏజెన్సీలు వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు లక్షల 35 వేల 140 కనెక్షన్లు ఉన్నాయి. సబ్సిడీ కింద ప్రభుత్వం లబ్ధిదారులకు చెల్లించాల్సిన సబ్సిడీ డబ్బులను ఎన్నిక ముందు వచ్చిన డబ్బులు తప్ప ఎన్నికల అనంతరం ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఈ పథకం సబ్సిడీ రాక గ్యాస్ వినియోగదారులు లబోదిబోమంటున్నారు. మూడు లక్షలపై బడి లబ్ధిదారులు సబ్సిడీ కోసం ఎదురు చూస్తున్నారు.

కామారెడ్డి జిల్లాలో 3,35,140 గ్యాస్ కనెక్షన్లు

కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ డివిజన్ కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లో కూడా వివిధ గ్యాస్ ఏజెన్సీలు హెచ్‌పీ, ఇండియన్, భారత్ గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి ద్వారా 3,35,140 గ్యాస్ కనెక్షన్లు ప్రతీనెల గ్యాస్ సిలిండర్లు సరఫరా జరుగుతోంది. వీటిలో డబుల్ సిలిండర్, సింగిల్ సిలిండర్ల కనెక్షన్లు ఉండగా, దీపం పథకం కింద 60,658 కనెక్షన్లు, కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కింద 39,233 కనెక్షన్లు, సీఎస్‌ఆర్ పథకం కింద 30,867 కనెక్షన్‌లు ఉన్నాయి. మొత్తం కనెక్షన్లకు ప్రతీ నెల సిలిండర్లు పంపిణీ జరుగుతోంది. ప్రస్తుతం గృహ సిలిండర్ ధర రూ.877లు ఉంది. ఈ మొత్తం వినియోగదారులు ముందుగా చెల్లించి గ్యాస్ తీసుకుంటే ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వం రూ.330, కేంద్ర ప్రభుత్వం రూ.46.90 సబ్సిడీని వినియోగదారుల బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేసుకుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రూ.46.90 మాత్రమే జమ అవుతుందని వినియోగదారులు తెలుపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూ.330 రావడం లేదు. ఈ విషయంపై గ్యాస్ ఏజెన్సీల వారు సబ్సిడీ జమ విషయాలు తమకు తెలియవని, యదావిధిగా వారి బ్యాంకుల్లో జమ అవుతాయని తెలుపుతున్నారు. సివిల్ సప్లయ్ అధికారులను అడిగితే కూడా ఆ వివరాలు తమకేమి తెలియవని చెబుతున్నారు. అసలు విషయం ఆరా తీస్తే ఎన్నికల తరువాత ప్రభుత్వం సబ్సిడీ నిధులు రావడం లేదని తెలుస్తోంది. తొలి విడతలో వచ్చిన డబ్బుల వరకు వినియోగదారుల బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఆ తరువాత నిధులు ఆగినట్లు సమాచారం. దీంతో చాలా మంది గ్యాస్ పథకం సబ్సిడీకి నోచుకోవడం లేదు. ప్రభుత్వం వెంటనే అందజేయాలని వినియోగదారులు కోరుతున్నారు.





ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు

మోర్తాడ్, జూలై 24: మండలంలోని పాలెం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీ, పదోన్నతిపై వెళ్లిన సిరిల్‌రావు, విజయలక్ష్మి, రికార్డు అసిస్టెంట్ శ్రీనివాస్‌రావులను ఘనంగా వీడ్కోలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. వారి స్థానంలో నూతనంగా పాఠశాలలో విధుల్లో చేరిన ఏ.రాజేందర్, త్రివేణి, జయశ్రీ, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.







కేజీబీవీలలో కనీస వేతనాలు అమలు చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నిజామాబాద్ అర్బన్, జూలై 24: కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టళ్లలో నాన్‌టీచింగ్ వర్కర్ల వేతనాలను పెంచాలని ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరుతూ ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్, వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. కేజీబీవీ, మోడల్ స్కూల్ నాన్ టీచింగ్, వర్కర్లకు వెంటనే కనీస వేతనాలు అమలు చేయాలని ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ముఖ్యంగా కాలేజీలుగా అప్‌గ్రేడ్ అయిన కేజీబీవీలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలని రిటైర్డ్‌మెంట్ వయస్సు 65 ఏళ్లకు పెంచాలని అన్నారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరి, హేమలత, సుమలత, స్వరూప, మోతి, సుమ, సుచెంద్ర, స్వర్ణలత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం


● ఏఐపీఎస్‌యూ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి బోడ అనిల్

నిజామాబాద్ అర్బన్, జూలై 24: కేంద్ర ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి చిన్నచూపు చూసిందని ఏఐపీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులతో ఏఐపీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ కేవలం రెండు రాష్ట్రాలకే పరిమితం చేస్తూ విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించడం దారుణమన్నారు. కొటారి కమిషన్ ప్రకారం విద్యారంగానికి 10 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 2.7 శాతం మాత్రమే కేటాయించడం విద్యారంగాన్ని అవమానించడమేనన్నారు. విశ్వవిద్యాలయాలకు గతంలో కంటే ఈసారి మరింత నిధులను తగ్గించారని ఒకవైపు దేశం అభివృద్ధి చెందుతుందని చెబుతున్నా కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో మాత్రం విద్యారంగాన్ని విస్మరించారని అన్నారు. కేవలం అధికారాన్ని కాపాడుకోవడం కోసమే బడ్జెట్‌లో కేటాయింపులు చేశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దినేష్, సిద్ధు, రాజేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్ ప్రతులతో నిరసన తెలుపుతున్న ఏఐపీఎస్‌యూ నాయకులు









పారిశుధ్యం, హరితహారం నర్సరీల పరిశీలన



మొక్కలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

భీమ్‌గల్‌రూరల్, జూలై24: భీమ్‌గల్ మండలంలోని రహత్‌నగర్, పెద్దమ్మ కాడితండా, గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం ట్రైనీకలెక్టర్ సాం కేతి కుమార్ పర్యటించారు. గ్రామ పంచాయతీల్లోని రికార్డులను పరిశీలించారు. పారి శుద్ధ్య పనులను పరిశీలించా రు. హరితహారం కార్యక్రమం లో భాగంగా మొక్కలను నాటారు. హరితహారంలో ఇప్పటివరకు ఎన్ని మొ క్కలను నాటారని ఎంపీడీవో సంతోష్‌కుమార్‌ను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గంగమోహన్,ఐకేపీ ఏపీఎం రవీందర్, సీసీలు కుంట శ్రీనివాస్, పురస్తునరేష్ తదితరులు పాల్గొన్నారు.

తాటిపల్లిలో వరి పంటను పరిశీలించిన డీఏవో

సిరికొండ జూలై 24 : సిరికొండ మండలం తాటిపల్లి గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ వరి పంటను పరిశీలించారు.గ్రామాల్లో ఏఈవోలు నమోదు చేసిన పంటల వివరాలు సక్రమంగా ఉన్నాయా అనే విషయాన్ని రీ ఎక్సామిన్ చేయడానికి వాజీద్ హుస్సేన్ బుధవారం తాటిపల్లి గ్రామంలో 15 సర్వే నెంబర్లలో పరిశీలించారు. ఏఈవో నమోదు చేసిన వివరాలు సరియైన విదంగా ఉన్నాయని డీఏవో గమనించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్, ఏఈవోలు ఉన్నారు.

బోధన్ డీఎల్‌పీవోగా మధుకర్

బోధన్‌రూరల్,జూలై24: బోధన్ డీఎల్‌పీవోగా మధుకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. బోధన్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న మధుకర్ డీఎల్‌పీవోగా బాధ్యతలు స్వీకరించారు. బోధన్ డీఎల్‌పీవోగా విధులు నిర్వహిస్తున్న సాయిబాబా బదిలీ అయ్యారు. నిత్యం అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందిస్తానని ఆయన పేర్కొన్నారు.

విజయసాయిరెడ్డి ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

బోధన్‌రూరల్,జూలై24: ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని తెలుగుదేశం పార్టీ జిల్లా పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి సీహెచ్‌వీ.హన్మంత్‌రావు అన్నారు. బుధవారం బోధన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయసాయిరెడ్డి విశాఖపట్నంలోని పలువురు ప్రభుత్వ, ప్రైవేటుకు వ్యక్తులకు చెందిన విలువైన భూములను ఆక్రమించినట్లుగా ఆరోపించారు. రాజకీయ ఉన్నత పదవులను అడ్డంగా పెట్టుకుని విలువైన భూములను కొల్లగొట్టడంతో పాటు అనైతిక చర్యలకు పాల్పడ్డ విజయసాయిరెడ్డి రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పై ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బడీడు పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దు

బోధన్‌రూరల్,జూలై24: బడీడు పిల్లలను పనులలో పెట్టుకోవద్దని చిల్డ్రన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధికారులు అన్నారు. బుధవారం సాలూర మండల కేంద్రంలో ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా రెండు షాపులలో పని చేస్తున్న ఇద్దరు బాల కార్మికులను గుర్తించారు. అనంతరం బాల కార్మికుల తల్లిదండ్రులను పిలిపించి అవగాహన కల్పించారు. 18సంవత్సరాల లోపు ఉన్న పిల్లలను పనులలో పెట్టుకోవద్దని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బాల కార్మికులు పని చేస్తున్నట్లయితే 1098టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ సభ్యులు, ముస్కాన్ బృందం తదితరులు పాల్గొన్నారు.

మానవ సదన్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలు

డిచ్‌పల్లి, జూలై24: తెలంగాణ రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు, మాజీమంత్రి కె.తారక రామారావు జన్మదిన వేడుకలు పురస్కరించుకొని డిచ్‌పల్లి మానవ సదన్‌లో విద్యార్థుల మధ్య మాజీఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కేక్‌కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మాజీఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరు నెలల కాలంలో రేవంత్ సర్కారుఅన్ని రంగాల్లో విఫలమైందని, కేసీఆర్ సీఎం ఉన్న హయంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్ర ప్రభు త్వం పై అనతి కాలంలోనే విమర్శలు రావడం శోచనీయమన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు అనుగుణంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెరాస నాయకులు కృష్ణ, పద్మరావు,నయీం పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు సిర్పరాజు, ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, ఎనుగందుల మురళి, శంకర్, విక్రమ్‌గౌడ్, ధర్మపురి, తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో

జిల్లా యువజన విభాగం నాయకులు పొద్దుటూరి అభిలాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగర పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీకంపల్లి ప్రశాంత్, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎర్గట్ల: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద బుధవారం బిఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు జరిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండ లాధ్యక్షుడు ఎనుగందుల రాజాపూరానందం, పీఏసీఎస్ చైర్మన్‌లు పెద్దకాపుల శ్రీనివాస్‌రెడ్డి, బర్మ చిన్న నర్సయ్య, కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, బద్దం ప్రభాకర్, పత్తిరెడ్డి ప్రకాష్, రాజారం సహదేవ్, రమేష్, శ్రీనివాస్, అశ్రఫ్, మోహన్‌లు పాల్గొన్నారు.



మానవ సదన్‌లో భోజనం వడ్డిస్తున్న మాజీఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

సిరికొండ: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామరావు పుట్టిన రోజు సందర్భంగా సిరికొండలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారవోయిన శ్రీనివాస్,భారత్ జాగృతి నిజామాబాద్ రూరల్ నియోజక వర్గం కన్వీనర్ మల్లెల సాయిచరణ్,బీఆర్ఎస్ మండల నాయకులు దువ్వూరి సంతోష్‌రెడ్డి, అన్సార్,మల్లేష్, నర్సారెడ్డి,బన్నీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్నిపురస్కరించుకొని బుధవారం మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, బద్దంచిన్నారెడ్డి,గడ్డంస్వామి, బద్రి,మురళి పాల్గొన్నారు.

పట్టణంలో ఆసుపత్రుల తనిఖీ



మందులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్, జూలై24: మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులను మున్సిపల్ కమిషనర్, ప్రత్యేక అధికారి రాజు బుధవారం పరిశీలించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, అర్బన్ ఆసుపత్రులతో పాటు బస్తీ దవాఖానాల ను పరిశీలించి ప్రజలకు సరైన మందుల వివరాలతో పాటు వైద్య సిబ్బంది సమయపాలన విషయంలో ఆరా తీశారు. అత్యవసర సమ యంలో మాత్రమే సెలవులు తీసుకోవాలని వైద్యసిబ్బంది సూచించా రు. ఆయన వెంట మున్సిపల్ ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ పూర్ణమౌళి, సానిటరీ ఇన్‌స్పెక్టార్ గజానంద్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

● మున్సిపల్‌లో ఉద్యోగులు బాధ్యతల స్వీకరణ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇటీవల బదిలీపై వచ్చిన ఉద్యోగులు బాధ్యతలను స్వీకరించారు. మున్సిపల్ మేనేజర్‌గా ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ నుంచి షేక్ ఖయ్యూం, రెవెన్యూ అధికారిగా మెట్‌పల్లి నుంచి కె.ఉమాదేవి, సానిటరీ ఇన్‌స్పెక్టార్‌గా కోరుట్ల నుంచి గజానంద్, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్‌గా నిజామాబాద్ నుంచి బి.వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్‌లు నిజామాబాద్ నుంచి పి.రాజయ్య, జె.సురేందర్, అశోక్‌లు, అలాగే బిల్‌కలెక్టర్‌లు ఎనిమిది మంది నిజామాబాద్ నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలను స్వీకరించినట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు.

బడ్జెట్ బడావ్యాపారులకు అనుకూలంగా ఉంది



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూలై24: కేంద్ర బడ్జెట్ బడావ్యాపారులకు అనుకూలంగా ఉందని, పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎటువంటి లాభం లేకుండా ఉందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్ అన్నారు. బుధవారం బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రానికి మద్దతుగా ఉన్న బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎక్కువ నిధులు కేటాయిస్తూ తన రాజకీయ నీతిని చెప్పాకనే చెప్తుందన్నారు. తెలంగాణకు అనుకున్నస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో విచారకరమన్నారు. దేశంలో గ్రామీణ ఉపాధి హామీ కొరకు సుమారు 2.40లక్షల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తిరునగిరి శశికళ, గైని రాములు, షేక్.నజీర్, బొర్ర సాయిలు, చింటు, సాయినాథ్, నెహాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

బోధన్‌రూరల్,జూలై24: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, వ్యాధుల పట్ల అవగాహన కలిగిఉండాలని వర్డ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని పెగడాపల్లి, పెంటాకలాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కౌమర దశలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలు, హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మంగళ, అబ్బయ్య, ఉపాధ్యాయ బృందం, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు



ఆర్మూర్ డిగ్రీ కళాశాలలో ఐఎస్‌వో పత్రాన్ని అందుకుంటున్న ప్రిన్సిపాల్

ఆర్మూర్‌రూరల్,జూలై24: ఆర్మూర్ పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఐఎస్‌వో ప్రామాణికత గుర్తింపు లభించింది. ఐఎస్‌వో సంస్థ వారు ఇటీవల కళాశాలను సందర్శించి కళాశాలలో విద్యార్థులకు అందజేస్తున్న వసతులు, అభ్యాసన, వాతావరణం పట్ల సంతృప్తి చెంది కళాశాలకు ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రాన్ని బుధవారం ఐఎస్‌వో సంస్థ బాధ్యులు అలపాటి శివ,ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌స్వామికి అందజేశారు. కళాశాలలో అందజేస్తున్న విద్య, నాణ్యత పట్ల ప్రముఖ గుర్తింపు సంస్థ ఐఎస్‌వో వారు గుర్తించి గౌరవించడం పట ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌స్వామి హర్షం వ్యక్తం చేశారు. దీని వల్ల కళాశాలకు విద్యనభ్యాసించే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 5 వరకు డిగ్రీ సీబీసీఎస్ రీవాల్యుయేషన్ గడువు

డిచ్‌పల్లి, జూలై 24: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ సీబీసీఎస్ రెండో, నాల్గవ, ఆరో సెమిస్టర్ (రెగ్యులర్), ఒకటో, మూడో, ఐదో సెమిస్టర్ (బ్యాక్‌లాగ్) పరీక్షల రీవాల్యుయేషన్ కొరకు ఆగస్టు 3 నుంచి 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పరీక్షల నియంత్రణ అధికారిని ఆచార్య అరుణ తెలిపారు.ఒక్కోక్క పేపర్‌కు రూ.500లు ఫీజు చెల్లించాలని అన్నారు.

కొనసాగుతున్న డిగ్రీ వన్‌టైమ్ ఛాన్స్ పరీక్షలు

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ వన్‌టైమ్ ఛాన్స్ ఐదో, ఆరవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఆచార్య ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 83 మంది విద్యార్థులకు గాను 80 మంది హాజరుకాగా 3 విద్యార్థులు గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు ముగ్గురికి ముగ్గురు విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు.

కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్ పరీక్షలు

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఇంటిగ్రేటెడ్ పరీక్షలకు ఉదయం జరిగిన పరీక్షలకు 14 మందికి గాను 14 మంది హాజరుకాగా, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 142 మందికి గాను 131 మంది హాజరుకాగా 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

టీయూకి రూ.200కోట్ల నిధులు ఇవ్వాలి

డిచ్‌పల్లి, జూలై24: ప్రత్యేక రాష్ట్రం పేరుతో ఉన్న తెలంగాణ యూనివర్సిటీకి రాష్ట్రప్రభుత్వం రూ.200కోట్ల నిధులు మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్న బోదన, బోధనేతర సిబ్బందిని నియామించాలని పీడీఎస్‌యూ యూనివర్సిటీ ప్రతినిధులు అక్షయ్, రవీంధర్ డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ విశ్వవిద్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నిధుల మంజూరుపై వివక్షత చూపవద్దన్నారు. యూనివర్సిటీలో బాలికల హాస్టల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ధర్పల్లి, జూలై 24:మండలంలోని రామడుగు గ్రామ శివారులో పేకాట ఆడు తున్న ఐదుగురిని అరెస్టు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. బుధవారం సాయంత్రం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలుసుకొని పేకాట స్థావరంపై దాడి చేసి వారి వద్ద ఉన్న రూ.2180లు స్వాధీనం చేసుకుని పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని ఆయన చెప్పారు.

తెలంగాణ స్పోర్ట్స్ అకాడమీకి తూంపల్లి విద్యార్థి ఎంపిక

సిరికొండ జులై 24 : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ హాకీ తూంపల్లి హైస్కూల్ విద్యార్థి ఎస్.కె.అర్బస్ ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయులు నగేష్ తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అద్వార్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో ఈ నెల 3, 4 తేదీలలో నిర్వహించిన ఎంపిక పోటీలలో ఎస్.కె. అర్బస్ మంచి ప్రతిభ చూపించినందున తెలంగాణ హాకీ అకాడమీకి ఎంపికయ్యారని నగేష్ తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి అకాడమీకి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు,ఎస్ఎంసీ చైర్మన్ నావణ్య, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు గంఆరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. అకాడమీ శిక్షణలో మంచి క్రీడనైపుణ్యాన్ని పంపొందించుకోవాలని గంగారెడ్డి ఆకాక్షించారు.

కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం

కమ్మర్‌పల్లి, జూలై 24 : మండంలోని హాసాకొత్తూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బండి దశరత్ మరణించడంతో ఆయన కుటుంబానికి బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్‌కుమార్ 10 వేల రూపాయల ఆర్థిక సహాయం చేయగా గ్రామ కాంగ్రెస్ నాయకులు బుధవారం అందజేశారు. కాగా గ్రామపంచాయతీ తరపున మరో 5 వేల రూపాయల ఆర్థికసహాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవతి గంగాధర్, పడిగెల ప్రవీన్, తెడ్డురమేష్ నాయకులు పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'

ఎడపల్లి, జూలై 24 : మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ (మాదకద్రవ్యాలు)పై ఎడపల్లి పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో హెడ్‌కానిస్టేబుల్ భీమ్‌రావ్ మాట్లాడుతూ విద్యార్థులు, చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలని, విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లను అలవర్చుకొని, చెడు అలవాట్లకు బానిసలు కావద్దని సూచించారు. ఎలాంటి మత్తుపదార్థాలకు అలవాటు పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు సాయిలు, సరిత, స్రవంతి, సురేందర్ గౌడ్, రాజేశ్వర్, కానిస్టేబుల్‌లు లాల్‌జీ, గణేష్, తదితరులున్నారు.

నీటి కొరత సమస్య పరిష్కారం దిశగా చర్యలు

మోస్రా, జూలై 24 : మండల కేంద్రంలోని కోళ్లఫారం కాలనీలో నీటికొరత ఉన్న విషయంపై బాన్సువాడ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి దృష్టికి మండల నాయకులు తీసుకెళ్లగా సమస్యలు పరిష్కారంలో ముందుండాలనే ఆలోచనతో మాజీ ఎంపీటీసీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోళ్లఫారం కాలనీలో బోర్ వేయించామని మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంఘం సాయిలు, మాజీ గ్రామ అధ్యక్షుడు నర్సారెడ్డి, సీనియర్ కార్యకర్తలు బిల్లా రాజశేఖర్ రెడ్డి, సతీష్ రెడ్డి, సురే లక్ష్మణ్, ఇంతియాజ్, కాలనీవాసులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోధన్‌లో అరుదైన శస్త్రచికిత్స

బోధన్‌రూరల్, జూలై 24 : ఆరోగ్యశ్రీలో బోధన్ పట్టణంలో అరుదైన శస్త్ర చికిత్సను వైద్యులు నిర్వహించారు. పట్టణంలోని అమృత టూ లైఫ్ ఆసుపత్రిలో మాజీద్‌అన్సరీ అనే 70 సంవత్సరాల వృద్ధుడికి కుడికాలు తుంటే విరగడంతో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఉపేంద్ర శస్త్రచికిత్స నిర్వహించి ఒక్కరోజులోనే నడిపించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు వైద్య బృందానికి కృతజ్ఞత తెలిపారు. ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేసి విజయవంతం చేయడం పట్ల కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులున్నారు.

సూపరింటెండెంట్‌గా సునీతా దేవి బాధ్యతల స్వీకరణ

నవీపేట,జూలై24: మండల పరిషత్ కార్యాలయ సూపరిండెంట్‌గా టీ.సునీత దేవి బుధవారం బాధ్యతల స్వీకరించారు. గతంలో మండల పరిషత్ కార్యాలయం సూపరిండెంట్‌గా పనిచేసిన శ్రీనివాస్ రావు జిల్లా పరిషత్ సూపరిండెంట్‌గా బదిలీ కాగా జిల్లా పరిషత్‌లో సూపరిండెంట్‌గా పని చేస్తున్న సునీత దేవి నవీపేటకు బదిలీపై వచ్చారు.

బడ్జెట్ కేటాయింపుల్లో పసుపు రైతులకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు

కమ్మర్‌పల్లి, జూలై 24 : బీజేపీ ప్రభుత్వం పసుపు రైతులను ముఖ్యంగా నిజామాబాద్ రైతులను మరో మారు మోసం చేసిందని కమ్మర్‌పల్లి పసుపు రైతులు ఆరోపించారు. బుధవారం మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీన్ మాట్లాడుతూ మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జేట్‌లో నిధుల కేటాయింపులు లేకపోవడం పసుపు రైతులను మోసం చేయడమేనన్నారు. రెండుసార్లు పసుపు బోర్డు పేర గేలిచిన ఎంపీ ధర్మపురి అర్వింద్ మరో మారు నిజామాబాద్ జిల్లా పసుపు రైతులను దగా చేశారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లుగాని, రైతులను ప్రోత్సహించే విధం గా బిందుసేద్యం పరికరాల విషయం గాని రైతులకు ఉపయోగ పడే విధంగా ఏ విధమైన పరికరాల గురించి నిధుల కేటాయింపులు గాని లేకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోనగిరి భాస్కర్, జిల్లా నాయకులు తక్కూరి దేవేందర్, రేవతి గంగాధర్, అల్లకొండ రాజేష్, సుంకెట బుచ్చన్న, పాలెపు నర్సయ్య, వేముల గంగారెడ్డి, పాష, తెడ్డు రమేష్, పూజారి శేఖర్, ప్రదీప్, శేఖర్, రాజేందర్, జగదీశ్ మోహన్ నాయక్, అజారోద్దిన్ , దూలూర్‌కిషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

● రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్

వేల్పూర్, జూలై 24 : అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్ అన్నారు. బుధవారం వేల్పూర్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏలేటి రమేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. మోసపూరితమైన సాధ్యం కాని హామీలను ప్రజలకు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా రాజకీయ తీర్మానాన్ని బద్దం రాజారెడ్డి, వ్యవసాయ తీర్మానాన్ని బెల్దారి నవీన్‌లు ప్రవేశపెట్టగా ఆ తీర్మానాలను నియోజకవర్గ కన్వీనర్ మల్కన్నగారి బలపరిచారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నరేళ్ళ శ్రీధర్ గౌడ్, సురేందర్, బీజేపీ నాయకులు మల్కన్నగారి మోహన్, రాజారెడ్డి, తీగెల మోహన్, లగిశెట్టి భానుచందర్, బెల్దారి నవీన్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హాసాకొత్తూర్‌లో ఊరపండగా

కమ్మర్‌పల్లి, జూలై 24: మండంలోని హాసాకొత్తూర్ గ్రాయంలో బుధవారం ఊరపండగను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. స్థానిక మహదేవ స్వామి ఆలయ నుంచి వలగొడుగు ఊరేగింపు నిర్వహించారు. వర్షాలు కురవాలని పంటలు పండాలని అయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ గ్రామదేవతలకు డప్పువాయిద్యాలతో వెళ్లి నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామకమిటి అధ్యక్షుడు కొమ్ముల రజనికాంత్, కార్యదర్శి కుందారం శ్రావన్, ఉపాధ్యక్షులు రాజుల చిన్నబాబయ్య, కోశధికారి రాదారపు నర్సయ్య, రైటర్ పెద్ది ధన్‌రాజ్, ఖాతాదారు కొమ్రె అంజి, లింబాద్రి,ఆదర్స్, గణేష్, భరత్ పాల్గొన్నారు.

భవానీపేట్‌లో సినిమా సందడి



వివరాలను వెల్లడిస్తున్న సినిమా బృందం

బోధన్‌రూరల్,జూలై24: మండలంలోని భవానీపేట్‌లో బుధవారం ఓ సినిమా షూటింగ్ చేయడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా సినిమా నిర్మాత ఆదినారాయణ మాట్లాడుతూ భవానీపేట్ గ్రామం పల్లె వాతావరణానికి అనుకూలంగా ఉందని, అందుకే గ్రామంలో సినిమా షూటింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఇంకా ఈ సినిమాకు టైటిల్ పెట్టలేదని త్వరలోనే సినిమా పేరు ఖరారు చేస్తామన్నారు. సినిమా చిత్రీకరణకు పోలీసుశాఖ, స్థానికుల నుంచి తమకు సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు. ఈ సినిమాలో భవానీపేట్ గ్రామానికి ప్రత్యేకత ఉంటుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ శంకర్, హీరో ఆది, హీరోయిన్‌గా అనికా, ప్రధాన పాత్రలో నానిబాబు నటిస్తున్నారని తెలిపారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిరంతర పోరు : పీఆర్‌టీయూటీఎస్



మాట్లాడుతున్న పిఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి

కమ్మర్‌పల్లి, జూలై 24: రాష్ట్రవ్యాపంగా రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో నిరంతర పోరు సాగించి సాధిస్తామని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండంలోని చౌట్‌పల్లి, కమ్మర్‌పల్లి, ఉప్లూర్, హసాకొత్తూర్, బషీరాబాద్, కోనసముందర్ ఉన్నత పాఠశాలల్లో పీఆర్‌టీయూటీఎస్ సభ్యత్వనమోదు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడులై ఉపాధాయుల సర్వీస్ రూల్స్‌ను సాధిస్తామని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు పిఎస్‌హెచ్ మంజూరి చేయిస్తామని సభ్యులందరికి హెల్త్ కార్డులు ఇప్పిస్తామని, సీపీఎస్ రద్దుచేయించ"డిఇనిక ప్రభుత్వంపై వత్తిడి తెస్తామని, జీవో 317 బాదితులను సొంత జిల్లాకు తీసుకువస్తామని అన్నారు. భృత్వ నమోదు కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్ ఆంధ్రయ్య, పిఆర్‌టీయూటీఎస్ కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అంజద్ సుల్తాన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాజేశ్వర్ గౌడ్, నాగభూషణం, మండల కార్యదర్శి రోహిత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస మూర్తి, ప్రధానోపాధ్యాయుల గంగాధర్, సామన్న, మధుపాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిల్చున్న చోటే గర్భిణి ప్రసవం

● జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఘటన

పెద్దబజార్, జూలై 24 : నగరంలో గల జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కాన్పుకోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణి నిల్చున్న చోటే ప్రసవించింది. వివరాల్లోకి వెళ్తే మోపాల్ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన జ్యోతికి నెలలు నిండడంతో బుధవారం ఉదయం కుటుంబసభ్యులు జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రికి తీసుకొచ్చారు సాయంత్రం సమయంలో నొప్పులు రావడంతో కాన్పుకోసం ఆపరేషన్ థియేటర్లోకి తీసుకెళ్తున్న సమయంలోనే నిల్చున్న చోటే గర్భిణి ప్రసవించింది. దీంతో ఆడ శిశువు జన్మించింది. కింద పడడంతో శిశువు తలకు గాయాలయ్యాయి. ఈమేరకు ఆసుపత్రి వైద్యులు శిశువుకు చికిత్స అందిస్తున్నారు. జ్యోతికి ఇది వరకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. లేబర్ రూమ్ వద్ద గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్న దాఖలాలు ఉన్నాయి.

కార్మిక వర్గాన్ని పట్టించుకోని కేంద్ర బడ్జెట్

పెద్దబజార్, జూలై 24: భారత సర్కార్ కేంద్ర బడ్జెట్‌ను కార్మిక వర్గాన్ని పార్లమెంట్‌లో పట్టించుకోలేదని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు భూమన్న అన్నారు. బుధవారం నగరంలోని ద్వారకనగర్‌లోగల ఐఎఫ్‌టియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పనిచేసే కార్మికులు లేకపోతే నడవగలిగిన వ్యవస్థ ఏదీ లేదని అలాంటప్పుడు కార్మికుల గురించి బడ్జెట్‌లో ఏమైనా కేటాయింపులు చేస్తారని ఆశించడం జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా 30కోట్ల కార్మికులకు తీవ్రమైన నిరాశ మన కేంద్ర బడ్జెట్‌లో ఉందని ఇప్పటికి 4 లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాసిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మోహన్, రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

రూరల్ ఎంపీవోగా ఇక్బాల్

నిజామాబాద్ రూరల్, జూలై 24: రూరల్ మండల పరిషత్ అధికారిగా (ఎంపీవో) ఇక్బాల్ నియామకమయ్యారు. ఇప్పటివరకు ఎంపీవోగా విధులు నిర్వహించిన మధురిమ మోస్రాకు బదిలీకావడంతో ఆమె స్థానంలో ఇక్బాల్ వచ్చారు. మోపాల్ ఎంపీవోగా ఉన్న ఇక్బాల్‌ను నిజామాబాద్ రూరల్ మండలానికి బదిలీచేశారు. బుధవారం ఉదయం ఎంపీవోగా ఇక్బాల్ బాదత్యలు తీసుకున్నారు. బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే రూరల్ మండలంలోని అన్ని గ్రామాలు పర్యటించి పారిశుధ్య పనులు పర్యవేక్షించారు. ఇక్బాల్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవో మధురిమ, సూపరింటెండెంట్ ప్రవీణ్‌రెడ్డి, ఏపీవో పద్మ, టీఏలు హరీం దర్,ప ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది ప్రశాంత్‌కుమార్, ఉమదేవి, శివ, పవన్‌కుమార్, తదితరులు అభినందించారు.

మోపాల్ : మండలంలోని ఎంపీవోగా కిరణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీవోగా పనిచేసిన ఎక్బాల్‌ను నిజామాబాద్‌కు బదిలీ చేశారు. పంచాయతీరాజ్ బదిలీల్లో భాగంగా ఈ బదిలీ జరిగినట్లు అధికారులు తెలిపారు. కిరణ్ నందిపేట్ ఎంపీవోగా పనిచేశారు. అక్కడి నుంచి మోపాల్ మండలంకు బదిలీపై వచ్చారు. ఇక్కడి నుంచి వెళ్లిపోతున్న ఎక్బాల్‌కు గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. బదిలీపై వచ్చిన కిరణ్‌కు కార్యదర్శులు, మండల అధికారులు పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు.

ముప్కాల్ : ముప్కాల్ మండల పరిషత్ ఎంపీవోగా మహమ్మద్‌గౌస్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేసిన భరత్‌చంద్ర మెండోర మండలానికి బదిలీపై వెళ్లగా ముప్కాల్ ఎంపీవోగా మహమ్మద్‌గౌస్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. కొత్తపల్లి సెక్రెటరీగా రాజు, నల్లూర్ సెక్రెటరీ విగ్నేష్, రెంజర్ల సెక్రెటరీగా టి.నరేష్‌లు పదవీ బాధ్యతలు స్వీకరించినట్టు మున్సిపల్ ఎంపీడీవో మహమ్మద్ ముజారఫుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మిర్దాపల్లిలో బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులకు సన్మానం

ఆర్మూర్‌రూరల్, జూలై 24: మండలంలోని మిర్దాపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోన్నతి పొంది బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్, రాజేష్, మమత, శంకర్, నరేంధర్‌లు ఉన్నారు.

చెరుకు రైతుల సంక్షేమమే లక్ష్యం

- రైతులకు నష్టం రానివ్వం
- గాయత్రి షుగర్స్ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌ప్రెసిడెంట్

సదాశివనగర్, జూలై 24 : గాయత్రిషుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చెరుకు రైతులకు ఒక్క శాతం నష్టం కల్గకుండా రైతు సంక్షేమా నికి గాయత్రిషుగర్స్ యాజమాన్యం కట్టుబడి ఉందని వైస్‌ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. రైతులపేరిట రుణాలు తీసు కున్నామనే విషయంపై బుధవారం విలేక రుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చెరుకు రైతుల చెరువు హర్వేస్టింగ్ లేబర్ అడ్వాన్స్, ఎరువులు, పురుగుమందులు, విత్తనాల కోసం ఫ్యాక్టరీ యాజమాన్యం ద్వారా 2003, 2004 సంవత్సరం నుంచి నిజామాబాద్‌లోని యూనియన్ బ్యాంకుతో అనుసంధానం ఏర్పాటు చేసుకుని రైతులకు రుణం అందించడం జరుగుతుందని తెలిపారు. కార్పొరేషన్ సంస్థల నిబంధనల ప్రకారమే రైతుఒప్పందం మేరకే ఈ రుణాలు తీసుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబరులోపు రుణాలు చెల్లింపు బ్యాంకుకు చేస్తున్నామన్నారు. రెండు సంవత్సరాల క్రితం ఈ కేవైసీ ఆధార్ సీడింగ్ చేయడం ద్వారా నేరుగా ప్రభుత్వమే రుణమాఫీ లిస్టును ఎంపిక చేయడం జరిగిందన్నారు. అందువల్ల రైతుల కోసం తీసుకున్న రుణాల మాఫీ విషయం రైతులకు మెసెజ్‌లు వెళ్లడం వల్ల కొందరు రైతులు అయోమయంలో పడ్డది వాస్తవమేనన్నారు. చెరుకు అగ్రిమెంట్ చేసే సమయంలోనే రుణపత్రం రైతు అనుమతితోనే చేయడం జరుగుతుందని, కార్పొరేషన్ ద్వారా లోన్‌తీసుకుని రైతులకు అందజేస్తే 15శాతం వడ్డీ పడుతుందని, రైతు ఒప్పందం మేరకు రైతుపేరిట రుణం తీసుకుంటే ఏడుశాతం వడ్డీ వస్తుందని తెలిపారు. దీని ద్వారా రైతులకే మేలు జరుగుతుందన్నారు. చెరుకు అగ్రిమెంట్ చేసు కుని రైతులకు రుణం చెల్లిస్తే ఈ కేవైసీ ఆధార్ సీడింగ్ వల్ల రైతుల కు ఇతర చోట్ల రుణం తీసుకో వడానికి ఇబ్బంది అవుతుందన్న ఉద్దేశంతో 2024-25 సంవత్స రానికి బ్యాంకు నుంచి రుణం పొందడం నిలిపి వేయడం జరిగిందన్నారు. మాగి, అడ్లూ ర్‌ఎల్లారెడ్డి షుగర్ ఫ్యాక్టరీల ద్వారా 2600 మంది రైతులపేర 19 కోట్ల 40 లక్షల వరకు రుణా లు తీసుకుని ప్రతి సంవత్సర చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతుల పేరుమీద మాఫీ జరిగిన ప్రతి రుపాయి రైతులకే అంది స్తామని, ఎలాంటి ఆందోళనవద్దని తెలిపారు. కాగా ఆర్‌డీఓ రంగనాథ రావు, వ్యవ సాయాధికారిణి భాగ్యలక్ష్మీ, తహసీల్దార్ గంగాసాగర్, ఏవో ప్రజాపతిలు రైతుల పేరిట రుణం తీసుకోవడంపై ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడారు. కార్యక్రమంలో డీజీఎం మురళి, ప్రెసిడెంట్ శంకర్, సీఎఫ్‌వో ప్రసాద్, ఫైనాన్స్ మేనేజర్ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

'క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయి'


ఆటలు ఆడుతున్న విద్యార్థినులు

గాంధారి, జూలై 24 : దేశీయ క్రీడలు మానసికోల్లాసాన్ని అందిస్తాయని వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మన్‌రాథోడ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో దేశీయ క్రీడలను ప్రోత్సహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన శిక్ష సప్తహ మూడోరోజుసెట్‌సంగంలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగింది. దేశియ ఆటలు తొక్కుడు బిల్ల, అష్టాచెమ్మ, వెన్నెల కుప్పలు, చెండాట, ఉప్పుతెచ్చే ఆట, పచ్చీస్ చిపిరిపుల్ల ఆట, నాలుగు స్తంభాలు, కుంటుడాట, సలకలాట, చిర్రగొనె, వంగుడూ దూకుడు తదితర ఆటలు ఆడించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీర్కూర్ ఎంపీవోగా మెహబూబ్

బీర్కూర్, జూలై 24 : మండల నూతన ఎంపీవోగా మెహబూబ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీవోగా బాధ్యతలు చేపట్టిన మెహబూబ్‌కు సూపరింటెండెంట్ భానుప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు శాలువాతో సన్మానించారు. ఇక్కడ ఎంపీవోగా ఇదివరకు పనిచేసిన అనిత నిజాంసాగర్‌కు బదిలీ అయ్యారు. బిచ్కుంద మండల ఎంపీవోగా విధులు నిర్వర్తిస్తున్న మహ బూబ్‌కు ఉన్నతాధికారులు బీర్కూర్‌కు బదిలీ చేశారు. కార్యక్రమంలో సూప రింటెండెంట్ భానుప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, సుజాత, కృష్ణకుమారి, మోహన్, సబిన్, ప్రకాష్, నవీన్, సతీష్, గురునాథ్ పాల్గొన్నారు.

జిల్లా అయ్యప్ప ధర్మప్రచార కమిటీ కార్యవర్గం ఎన్నిక

బీర్కూర్, జూలై 24 : మండల కేంద్రంలో బుధవారం అయ్యప్ప స్వాములు సమావేశమయ్యారు. అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచారసభ కామారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి, రాష్ట్ర కమిటీ కోశాధికారి పోతుగంటి గంగాధర్, అబ్జర్వర్‌గా డి.భాస్కర్‌ల పర్యవేక్షణలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. కామారెడ్డి జిల్లా కమిటీ అధ్యక్షుడిగా కొర్రి సుధాకర్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా కె.గంగాధర్, కార్యదర్శిగా జి.సుభాష్, కోశాధికారిగా కె.కృష్ణ, ఈసీ మెంబర్లుగా మాదప్ప, సిద్దులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

బిచ్కుంద, జూలై 24 : మండలంలోని రాజాపూర్ గ్రామస్తుడైన కొత్తరాములు విద్యుత్‌షాక్‌తో మృతిచెందినట్లు ఎస్‌ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం తనపొలం వద్ద పొలంలో నాటువేస్తుండగా స్టార్టర్, బోరు మోటార్‌ను కలిపే కేబుల్‌వైర్ నీళ్లలో పడిందని తీయబోయాడు. అప్పటికి ఆ వైరు తెగిఉండడంతో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడని ఎస్‌ఐ తెలిపారు.

సెమిస్టర్ పరీక్షల్లో సాందీపని విద్యార్థుల ప్రతిభ

కామారెడ్డిటౌన్, జూలై 24 : తెలంగాణ యూనివర్సిటీ బుధవారం ప్రకటించిన సెమిస్టర్-2, 4 ఫలితాలలో సాందీపని డిగ్రీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనభరిచినట్లు కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.హరిస్మరణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సాయి బాబు తెలిపారు. ఎంఎస్‌టీడీఎస్‌లో సెమిస్టర్-2 విభాగంలో రచన 9.84, ఎన్ జడ్‌సీ సెమిస్టర్-2 విభాగంలో భవాని 9.84, ఎంఎస్‌టీడీఎస్‌లో సెమిస్టర్-4 విభాగంలో భానురేఖ 9.84, అక్షయ 9.72 ఎస్‌జీపీఏ సాధించి యూనివర్సిటీ టాపర్లుగా నిలిచారని తెలిపారు.

'వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చూడాలి'

రామారెడ్డి, జూలై 24 : వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీవో తిరుపతిరెడ్డి ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాలు, తండాలలో ప్రజలకు ఎలాంటి అవస్థలు లేకుండా చూడాలని తెలిపారు. దోమకాటు రోగాల భారిన పడకుండా, ఇతర వ్యాధులు దరిచేరకుండా శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

కామారెడ్డిటౌన్, జూలై 24 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలోని ఒక ఫామ్‌హౌస్‌లో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపతయ్య మాట్లాడుతూ దేవునిపల్లి పీఎస్ పరిధిలోని లింగాపూర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను అరెస్ట్ చేశామని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,12,800, రెండుకార్లు, 4 బైక్‌లు, 10 మొబైల్‌లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

ఇనోవేటర్ ప్రోగ్రాం పోస్టర్ల ఆవిష్కరణ

నాగిరెడ్డిపేట, జూలై 24 : నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఇంటింటా ఇనోవేటర్ అనే ప్రోగ్రాంకు సంబంధించిన పోస్టర్‌లను బుధవారం స్థానిక ఎంపీవో ప్రభాకర్‌చారి ఆవిష్కరించారు. గ్రామాలలో ఎవరైనా వినూత్న ఆలోచనలతో కొత్త, కొత్త పరికరాలను తయారు చేసిన వారు ఉన్నట్లయితే వారు తమ వివరాలను, కొత్తగా తయారు చేసిన పరికరానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను ఆగస్టు 3వ తేదీలోగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని ఎంపీవో కోరారు. కార్యక్రమంలో ఇనోవేటర్ జిల్లా కో-ఆర్డినేటర్ గగన్, మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏడో వార్డులో రోడ్డు మరమ్మతులు

ఎల్లారెడ్డి, జూలై 2 : మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులోని దోబీగల్లికి వెళ్లే దారిలో బురద, పిచ్చి మొక్కలు ఉన్నందున నడవడానికి ఇబ్బందికరంగా ఉందని వార్డుప్రజలు స్థానిక ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్‌కు తెలియజేశారు. తక్షణమే స్పందించిన మున్సిపల్ అధికారులతో మాట్లాడి ఇబ్బందికరంగా ఉన్న రోడ్డును డోజర్ ట్రాక్టర్‌తో బురదను, పిచ్చి మొక్కలను తొలగించి గుంతలలో చిప్స్‌కంకర డస్ట్ వేయించారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, మహేష్, ప్రశాంత్, బాల కిషన్, హీరాలాల్, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

పోచారం ప్రాజెక్టులో తగ్గిన ఇన్‌ఫ్లో


7.7 అడుగులకు చేరిన నీటిమట్టం

నాగిరెడ్డిపేట, జూలై 24 : పోచారం ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టులోకి వరదనీరు స్వల్పంగా వచ్చి చేరగా, బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టులో రావడం బాగా తగ్గిపోయింది. పోచారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఇటీవల మంచిప్ప అడవుల్లో లింగంపేట, గాంధారి, తాడ్వాయి, రాజంపేట తదితర మండలాల్లో కురిసిన వర్షాల కారణంగా లింగంపేట, గుండారం వాగుల ద్వారా ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరింది. బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 7.7 అడుగుల నీరువచ్చి చేరింది. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 1.820 టీఎంసీలకు గాను ప్రస్తుతం 0.355 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 206 క్యూసెకులకు తగ్గిందని ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా తెలిపారు.

ఎస్పీని సన్మానించిన బ్రాహ్మణ సంఘం నాయకులు



ఎస్పీ సింధూశర్మను సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం నూతనకార్యవర్గం

నిజాంసాగర్, జూలై 24 : కామారెడ్డి జిల్లా బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గసభ్యులు బుధవారం జిల్లా ఎస్పీ సింధూశర్మను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఇటీవల నూతన కార్యవర్గం ఎంపిక చేశామని, మర్యాదపూర్వకంగా కలిసినట్లు వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీనివాస శర్మ, మహిళా ఉపాధ్యక్షురాలు సునీత, ప్రధానకార్యదర్శి సతీష్‌కుమార్, కోశాధికారి నవీన్‌కుమార్, వేంకటేశ్వర రావు, అరుంధతి, అర్జున్‌రావు, చక్రధర్‌రావు, భానుశర్మ ఉన్నారు.

డిప్యుటేషన్లను రద్దు చేయాలని వినతి


డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కామారెడ్డిటౌన్, జూలై 24 : నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ డిప్యుటేషన్లను రద్దుచేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం డీఈవో రాజును కలిసి వినతిపత్రం అందించారు. పెద్దకొడప్‌గల్ మండలం జడ్పీహెచ్‌ఎస్ కౌలాస్ నుంచి పీడీ ఎల్లారెడ్డి జడ్పీహెచ్‌ఎస్ మత్తమాల్‌కు వచ్చారని అక్కడ ఉన్న పీడీని కామారెడ్డి జడ్పీ హెచ్ ఎస్ చిన్న మల్లారెడ్డికి కేటాయించారని తెలిపారు. జుక్కల్ మండలంలోని యూపీఎస్ బస్వాపూర్ నుంచి తెలుగు స్కూల్ అసిస్టెంట్‌ను లింగంపేట బాయ్స్‌హైస్కూల్ కేటాయించారని, నాగి రెడ్డిపేట చీనూర్ నుంచి బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్‌ను డీఈవో కార్యాలయంకు డిప్యుటేషన్ చేశారని, లింగంపేట మండలం జడ్పీహెచ్‌ఎస్ షెట్పల్లి సంగారెడ్డి నుంచి ఇంగ్లీష్ స్కూల్ అసి స్టెంట్‌ను జడ్పీహెచ్‌ఎస్ గంజ్ పాఠశాలకు డిప్యుటేషన్ చేశారని తెలిపారు. వీరందరి డిప్యుటేషన్‌లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని పునఃసమీక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట కోశాధికారి సంగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిపై దాడిచేసిన కొడుకుపై కేసు నమోదు

ఎల్లారెడ్డి, జూలై 2 : తల్లిపై దాడిచేసిన కొడుకుపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్‌ఐ మహేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్లారెడ్డి మండలంలోని లక్మాపూర్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ళ భగీరథ అనే మహిళకు ఇద్దరు కుమారులు, అందులో పెద్ద కుమారుడైన జైపాల్ మద్యానికి బానిసై ఎలాంటి పనిచేయకుండా తరచూ ఇంట్లో గొడవ పడుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చిన అనంతరం జైపాల్ తండ్రి సంజీవులు పొలం పనికి వెళ్లాలని చెప్పడంతో మద్యం మత్తులో ఉన్న జైపాల్‌తల్లిని కొట్టి గాయపరిచాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యపై హత్యాయత్నం కేసులో భర్తకు ఐదేళ్ల జైలు

లింగంపేట రూరల్, జులై 24 : మండలంలోని పోతాయిపల్లికి చెందిన గారబోయిన చిన్నసంగయ్య తన భార్యను వేధింపులకు గురిచేసి, హత్యాయత్నానికి పాల్పడిన కామారెడ్డి అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారిణి నాగరాణి నిందితునికి ఐదుసంవత్సరాల సాధారణ జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధించినట్లు లింగంపేట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. వరకట్న వేధింపుల కింద సంవత్సరం జైలుశిక్ష రూ.1000 జరిమాన విధించినట్లు ఆయన పేర్కొన్నారు. కేసు విచారణను చేపట్టిన సీఐ శ్రీనివాస్, వాదనలు వినిపించిన పీపీ దామోదర్‌రెడ్డి, సాక్షులను ప్రవేశపెట్టిన సీఐ రవీందర్‌రెడ్డి, ఎస్సై చైతన్యకుమార్, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ మనోహర్‌రావు, కానిస్టేబుల్ కిరణ్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

తండ్రిని హత్యచేసిన కొడుకుకు జీవితఖైదు

కామారెడ్డిటౌన్, జూలై 24 : కన్నతండ్రిని హత్యచేసిన కేసులో నిందితుడైన కొడుకుకు జీవితఖైదుతో పాటు రూ.20 వేల జరిమానాను న్యాయస్థానం విధించినట్లు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాకు చెందిన భూక్యపకిరా అనే వృద్ధుడిని తన కొడుకైన భూక్యభాష ఉగ్రవాయిశివారులో ఇంద్రసేనారెడ్డి పొలం వద్ద కొట్టి ఉరివేశాడని తెలిపారు. తండ్రికి, కొడుకుకు మధ్య సంబంధించిన లోన్‌డబ్బుల విషయంలో తగదాలున్నాయి. 2021 మార్చి 9న భాష భుక్యపకిరాతో కలిసి బ్యాంకులో ఉన్న లోన్ గురించి కామారెడ్డికి వెళ్దామని చెప్పి తన బైక్‌పై ఎక్కించుకుని ఉగ్రవాయి శివారుకు తీసుకెళ్లాడు. ఇంద్రసేనారెడ్డి అనే వ్యక్తి పొలం వద్దకు రాగానే భూక్యపకిరిను ఇష్టారీతిన కొట్టి అతని మెడలో ఉన్న తువ్వాలతో మెడకు గట్టిగా చుట్టిఊపిరి ఆడకుండా చేసి హత్యచేశాడని తెలిపారు. దీంతో మృతుని తమ్ముని కొడుకు భూక్యహుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టులో నిందితుని ప్రవేశపెట్టగా అందుకు సంబంధించి విచారణ చేపట్టిన కోర్టు బుధవారం శిక్షను ఖరారుచేసిందని తెలిపారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు


జుక్కల్ చౌరస్తాలో కేటీఆర్ జన్మదిన వేడుకలు

మద్నూర్, జూలై 24 : మండలంలోని మేనూర్‌లో ఐటీ మాజీ మంత్రి కె.రామారావు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జుక్కల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి మాజీ శాసనసభ్యులు హన్మంత్ షిండే ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్ర మంలో బీఆర్‌ఎస్ మాజీమండల అధ్యక్షులు హన్మాండ్లు మేస్త్రి, మాజీసర్పంచ్ నిజాముద్దీన్, కంచన్‌రవి, భూమన్న, గోవింద్, విజయ్, రాజు పాల్గొన్నారు.

బాన్సువాడ టౌన్ :బాన్సువాడ పట్టణంలో బీఆర్‌ఎస్ ఫ్లెక్సీ వెలిసింది. మున్సిపాలిటీ వైస్‌చెర్మన్ షేక్‌జుబేర్ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

పెద్దకొడప్‌గల్ : తెలంగాణ రాష్ట్ర ఐటీ మాజీమంత్రి కేటీఆర్ జన్మదిన వేడు కలు జుక్కల్‌చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో జుక్క ల్ బీఆర్ ఎస్ నాయకులు నీలూపటేల్, బొల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్‌కుమార్ మాట్లాడారు.

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్) : మాజీ జడ్పీచైర్మన్ దఫెదార్ రాజు నివాసంలో బీఆర్‌ఎస్ నాయకులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ ఎస్ మండలాధ్యక్షుడు సాదుల సత్యనా రాయణ, గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజీద్ అలీ, దఫెదార్ విజయ్‌కుమార్, మాలిష్ రాజు, రామా గౌడ్, నరేష్, సాయిలున్నారు.

'పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి'


పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

రామారెడ్డి, జూలై 24 : పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం రామారెడ్డి మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, రామారెడ్డి గ్రామపంచాయతీలో చేపడుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో కీటికిలకు జాలీలు ఏర్పాటు చేయాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శ్రీనివాస్, ఎంపీఓ తిరుపతి,మెడికల్ ఆఫీసర్ సురేష్, పంచాయతీ సెక్రటరీ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

'ప్రమాదకరమైన ఇళ్లను తొలగించండి'



చెట్లపొదలను తొలగింపజేస్తున్న మున్సిపల్‌చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్, జూలై 24 : పట్టణంలోని టేక్రియాల్‌లో పలు పనులను మున్సిపల్‌చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ప్రమాదకరమైన పెచ్చులు ఊడిపోయిన ఇళ్లను వెంటనే తొలగించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. రోడ్లగుంతలను మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలని, మంచినీటి సౌకర్యం ఉండేట్లు చూడాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతనిస్తు మాస్‌క్లీనింగ్ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డు కౌన్సిలర్ శంకర్‌రావు, పాతశివ కృష్ణమూర్తి, చాట్లవంశీ, అంజద్, సాయి బాబా తదితరులు పాల్గొన్నారు.

'స్మితాసబర్వాల్ దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి'

కామారెడ్డి టౌన్, జూలై 24 : కేంద్రప్రభుత్వ సర్వీస్ ఉద్యోగాల్లో దివ్యాంగుల రిజర్వేషన్లు అవసరం లేదని వ్యాఖ్యానించిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్పదుర్గప్రసాద్ అన్నారు. దివ్యాంగుల సమాజంలో చాలామంది ఉన్నతస్థాయిలో ఉన్నారని, అందం ఉండడం కాదు మనసు అందంగా ఉండడం కావాలన్నారు. దివ్యాంగులను కించపరిచేలా మాట్లాడిన స్మితసబార్వాల్‌ను కేంద్ర ప్రభుత్వం స్పందించి 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సబ్ కమిటీ చైర్మన్ ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు గాడినర్సింలు పాల్గొన్నారు.

'గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టండి'


గుండూర్ గ్రామంలో పారిశుధ్యం పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

పెద్ద కొడప్‌గల్, జూలై 24 : జుక్కల్ మండలంలోని ఆయా గ్రామాలలో గల పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో వ్యాధులు వ్యాపించకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని గుండూర్, గుండూర్ తండాలలో పర్యటించారు. గ్రామంలో పారిశుధ్య పనులు పరిశీలించి వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో పాటుగానే అంగన్‌వాడీ పాఠశాలను తనిఖీ చేసి చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. గ్రామంలో మొక్కలు నాటుతున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద మొక్కలతో అధిక లాభాలు


ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటుతున్న వైద్యులు

పెద్ద కొడప్‌గల్, జూలై 24 : ఆయుర్వేద మొక్కలు నాటడం వలన అధిక ఉపయోగాలు ఉంటాయని పెద్దకొడప్‌గల్ మండల ఆయుర్వేద వైద్యులు వెంకటస్వామి తెలిపారు. బుధవారం ఆసుపత్రి ఆవరణలో ఆయుర్వేద మొక్కలు నాటారు. పురాతనకాలంలో ఆంగ్లవైద్యం లేని రోజులలో ఆయుర్వేద వైద్యంతోనే రోగాలకు చికిత్సలు చేసేవారని తెలిపారు. ఆంగ్లవైద్యం వచ్చిన తర్వాత ప్రజలు ఆయుర్వేద మందులు తీసుకోవడం తగ్గిందని తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో కలబంద, తెల్లచందనం, పసుపు, మెంటు తులసీ, కరంజ, వేప, తులసీ లాంటిమొక్కలను నాటడం జరిగిందని తెలిపారు.

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

భిక్కనూరు, జూలై 24: విద్యార్థినులు మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారిక కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ శిరీష అన్నారు. బుధవారం భిక్కనూరు మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యారినులకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ ఒక శక్తి మూర్తి అని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం కొత్తచట్టాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్, జిల్లా మహిళా సాధికారక కేంద్రం సిబ్బంది శారధ, తులసి, శిరీష, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలి'

భిక్కనూరు, జూలై 24: మాజీసర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గుడిసె రాములు కోరారు. బుధవారం భిక్కనూరులో మాట్లాడుతూ తాము సర్పంచ్‌లుగా ఉన్న సమయంలో గత ప్రభుత్వాల ఆదేశాలతో గ్రామాభివృద్ధికి తమ సొంత డబ్బులు వెచ్చించి చాలా పనులు చేశామని, ఇప్పటికీ వాటికి సంబంధించిన డబ్బులు రాలేవని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ డబ్బులను చెల్లిం చాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని మాజీసర్పంచ్‌లు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నిజాంసాగర్, జూలై 24 : నిజాంసాగర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశపరీక్ష నిర్వహిం చను న్నట్లు వివరించారు. అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనంతరం పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మద్నూర్‌లో ముసురు వర్షం

మద్నూర్, జూలై 24 : ఉమ్మడి మద్నూర్ మండలంలో ముసురు వర్షం పడుతుంది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ముసురు కొనసాగింది. కలుపు తీసి సిద్దంగా ఉన్న పంటలకు ఈ వర్షం మేలు చేస్తుంది. కాని ముసురు వాన వల్ల వాగులు వంకల్లో నీటి ప్రవాహం లేకపోవడంతో జలాశయాలు నిండలేదు. ముసురుతో పల్లెల్లో జనం ఇబ్బం దులు పడుతున్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	ఓసీ
దర్శన్	డార్లింగ్
ప్రియా 70	కల్కి
ప్రియా 35	భారతీయుడు-2

బాన్సువాడ	
మహేశ్వరి	కల్కి
వెంకటేశ్వర	డార్లింగ్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230

